సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

శనివారం | 15 | జూలై | 2023



అయ్యో..'పాప'ం!
అక్రమ దత్తతకు సంబంధించిన పాప అనారోగ్యంతో ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయింది. పాప మృతిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. - 8లో▸



ఆరు మోటార్లతో ఎత్తిపోతలు
జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి లక్ష్మీ పంపుహౌస్‌లో ఆరు మోటార్లతో నీటిని ఎత్తిపోస్తున్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$33^0/25^0$

వాతావరణం
ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం చల్లగా ఉంటుంది. సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతుంది.

న్యూస్‌రీల్

23 వరకు ఉచిత శిక్షణ దరఖాస్తు గడువు

న్యూశాయంపేట: తెలంగాణ రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్, మైనార్టీ సంక్షేమ శాఖ, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో సివిల్స్ పరీక్షల కోసం సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ఉచిత కోచింగ్ అందించనున్నట్లు హనుమకొండ జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి మేన శ్రీను శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23 వరకు దరఖాస్తుల గడువు పొడిగించినట్లు ఆయన పేర్కొన్నారు. అభ్యర్థులు దరఖాస్తులను www.cet. cgg.gov.in//tmreis వెబ్‌సైట్‌లో సమర్పించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు హనుమకొండ సుబేదారి కలెక్టరేట్ కాంప్లెక్స్‌లో రెండో అంతస్తులోని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి కార్యాలయంలో గానీ, 040-23236112 నంబర్లలో గానీ సంప్రదించాలని సూచించారు.

17న గురుకుల ఉపాధ్యాయుల నిరసన దీక్ష

విద్యారణ్యపురి: రాష్ట్రంలోని గురుకుల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఈనెల 17న హనుమకొండలోని ఏకశిల పార్కు వద్ద నిరసన దీక్ష చేపట్టనున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. గురుకులాల్లో బదిలీలు, పదోన్నతుల కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల, పారిటీ స్కేల్స్ అమలు, తదితర 26 రకాల డిమాండ్ల సాధనకు నిరసన దీక్షలు చేపట్టనున్నట్లు ఆయూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.సోమశేఖర్, హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సదాశివరెడ్డి, తాటికాయల కుమార్, పెండెం రాజు, బద్దం వెంకటరెడ్డి పేర్కొన్నారు. అన్ని యాజమాన్యాల గురుకుల ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

చెస్‌లో గౌతమ్ సిద్ధార్థ్ ప్రతిభ



వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జులైవాడకు చెందిన గౌతమ్ సిద్ధార్థ్ ఆల్ ఇండియా 1600లోపు ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్‌లో అద్భుత ప్రతిభ కనబరిచి 1,122 పాయింట్లను సాధించాడు. జూన్ 2, 3, 4 తేదీల్లో హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో జరిగిన మొదటి తెలంగాణ గురుకులాల ఆల్ ఇండియా బిలో 1,600 ఫిడే రేటింగ్‌లో పాలొని ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 1,122 పాయింట్లను సాధించాడు. సిద్ధార్థ్ ప్రస్తుతం ఏడో తరగతి చదువుతున్నాడు. హనుమకొండ రాంనగర్‌లోని కమల్‌కింగ్స్ చెస్ అకాడమీలో కోచ్ రాంప్రసాద్ వద్ద శిక్షణ పొందుతున్నాడు.

'ప్రాణాంతక వ్యాధులను అరికట్టవచ్చు'

హన్మకొండ అర్బన్: ప్రాణాంతక వ్యాధులను జెనెటిక్ ఇంజనీరింగ్ ద్వారా అరికట్టవచ్చని డిపార్ట్‌మెంట్ ఆఫ్ జెనెటిక్స్, ఢిల్లీ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ వెంకట్‌రాజం అన్నారు. శుక్రవారం పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాలలో ప్రిన్సిపాల్ చంద్రమౌళి ఆధ్వర్యంలో 'ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఇన్ జెనెటిక్ ఇంజనీరింగ్' అంశంపై నిర్వహించిన సెమినార్‌కు ప్రొఫెసర్ వెంకట్‌రాజం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అగ్రి, ఇండస్ట్రియల్, హెల్త్ కేర్ బయోటెక్నాలజీ, తదితర అంశాలపై వివరించారు. జన్యుపరంగా మార్పు చెందిన మొక్కల ప్రాముఖ్యత, మానవ ఆరోగ్యంలో జీఎంఓఎస్ జన్యు చికిత్సను ఉపయోగించి జన్యు వ్యాధుల చికిత్స గురించి వివరించారు. హెచ్ఐవీ వంటి వ్యాధులకు లక్ష్య చికిత్సలను ప్రయోగశాలల ఆధారిత సాంకేతికతలతో అభివృద్ధి చేయడం జెనెటిక్ ఇంజనీరింగ్ ద్వారా సాధమైందని, ప్రాణాంతక వ్యాధులను సైతం అరికట్టవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.సుహాసిని, సీఓఈ డి.రామకృష్ణ, ఏసీఓఈ జి.రేణుక, అకడమిక్ కో-ఆర్డినేటర్ పార్వతి, కల్పన, సరిత, విద్యార్థులు పాల్గొన్నారు.

18న జాబ్‌మేళా

హన్మకొండ అర్బన్: జిల్లాలోని నిరుద్యోగ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈనెల 18న నగరంలోని ములుగు రోడ్డు, ప్రభుత్వ ఐటీఐ క్యాంపస్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి యం.మల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. విన్ మోటర్ (వరంగల్, హనుమకొండ)లో ట్రైనీ టెక్నీషియన్, ట్రైనీ అడ్వైజర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేసేందుకు దాదాపు 40 ఉద్యోగాలకు ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఐటీఐ, బీటెక్/ డిప్లొమా, డిగ్రీ/ఎంబీఏ చదివి 18 నుంచి 30 ఏళ్లలోపు యువకులు ఉద్యోగాలకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు వారి విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో ఈనెల 18న జిల్లా ఉపాధి కార్యాలయంలో హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 98488 95937 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

స్మార్ట్.. పిటీ!

గ్రేటర్ వరంగల్‌వాసులకు కలగానే సుందరనగరం

2016లో ప్రారంభమైనా పూర్తికాని స్మార్ట్ సిటీ పనులు



ఈ ఫొటో చూడండి.. నర్సంపేట నుంచి వరంగల్ నగరంలోకి ప్రవేశించే రహదారి ఇది. ఇక్కడ ప్రజలను ఆకట్టుకునేందుకు.. నగరానికి ఆహ్వానం తెలిపేలా కాకతీయుల కళాతోరణం ఆకారంలో స్వాగత తోరణం ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ పనులు ఇంకా మొదలు కాలేదు. ఎప్పుడు ప్రారంభిస్తారో తెలియదు. అదే మాదిరిగా నగరం చుట్టూ స్వాగత తోరణాల ఏర్పాటుకు రూ.1.17 కోట్లు కేటాయించారు. వాటి పరిస్థితి కూడా ఇంతే.



సైకిల్ ట్రాక్ లేకుండా ఉన్న భద్రకాళి స్మార్ట్ సిటీ రోడ్డు ఇదీ. వరంగల్‌లోని భద్రకాళి అమ్మవారి దేవాలయం వరకు కార్లు, ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేసి సైకిళ్లపై వెళ్లాలని నిర్ణయించారు. కాపువాడ రోడ్ వరకు ట్రాక్ నిర్మాణం కోసం నిధులు కేటాయించినా పనులు కాలేదు. ఇదే సమయంలో కాజీపేట ఫాతిమా జంక్షన్ నుంచి సుబేదారి జంక్షన్ డెవలప్‌మెంట్ కోసం కూడా రూ.2 కోట్లు ప్రతిపాదించారు.



వరంగల్ చౌరస్తా నుంచి కరీమాబాద్ ఫ్లైఓవర్‌కు వెళ్లే రోడ్డుతో పాటు ఆరు పనులను రూ.27.50 కోట్లతో ప్రతిపాదించారు. ఇందులో భాగంగా ఈ నిధులతో పోచమ్మ మైదాన్ నుంచి మండిబజార్ వరకు రోడ్డు వేసి ఫుట్‌పాత్‌లు వేయడం మరిచిపోయారు. ఫలితంగా 'స్మార్ట్' పనులు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి.

నిధులే అసలు సమస్య...

పనులకు అవరోధం ఏమిటనే దానిపై నగరపాలక సంస్థ ఇంజనీర్లు పెదవి విప్పడం లేదు.

- అభివృద్ధి పనులకు నిధులే సమస్య అనే అభిప్రాయం సర్వత్రా ఉంది.
- కాంట్రాక్టర్లు కూడా పనులు సకాలం పూర్తి చేయడం లేదన్న వాదన ఉంది.
- ఐదేళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వాటాల కింద రూ.1,000 కోట్లు ఇవ్వాల్సి ఉండగా.. రూ.396 కోట్లను మాత్రమే దశల వారీగా కేటాయించారు.
- రూ.74.15 కోట్ల విలువ చేసే 27 పనులే ఇప్పటికి పూర్తయ్యాయి.
- ఇలాగైతే రూ.2,305.77 కోట్ల బృహత్తర ప్రణాళిక ప్రకారం.. ఆ నిధులు ఎప్పుడొస్తాయి? గ్రేటర్ వరంగల్ సుందర నగరంగా ఎప్పుడు మారుతుంది? అన్న చర్చ జరుగుతోంది.



జేపీఎన్ రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్



స్వాగత తోరణం లేకుండా ఉన్న గుడెప్పాడ్ రోడ్డు

సాక్షి ఫోకస్



మేదరివాడలో మూడు నెలలకే కంకరతేలిన సీసీ రోడ్డు

- కేంద్రం, రాష్ట్రం వాటా రూ.1,000 కోట్లు
- ఇప్పటికీ ఇచ్చింది రూ.396 కోట్లు
- ఖర్చు చేసింది రూ.74.15 కోట్లు
- 66 ప్రాజెక్టులకు ఏడేళ్లలో పూర్తయినవి 27 మాత్రమే
- స్వాగత తోరణాల పనులకు లేదు మోక్షం
- అధ్వానంగా రోడ్లు, డ్రెయినేజీల పనులు

సాక్షిప్రతినిధి, వరంగల్:

స్మార్ట్ సిటీ.. కాస్త పిటీగా తయారైంది. రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్న వరంగల్ నగరాన్ని 2016 మే 16న కేంద్రం రెండో (సప్లిమెంటరీ) దశలో 'స్మార్ట్‌సిటీ' జాబితాలోకి చేర్చింది. కేంద్ర, ప్రభుత్వాల వాటా కింద రూ.1,000 కోట్లు ఇవ్వాల్సి ఉండగా.. ఇప్పటివరకు కేంద్రం రూ.196 కోట్లు, రాష్ట్రం రూ.200 కోట్ల వరకు ఇచ్చింది. ఇక్కడ ప్లానింగ్ పక్కాగా లేక ఎక్కడ ఏం జరుగుతుందో.. ఏ పని ఎటు వెళ్తుందో తెలియక స్మార్ట్ సిటీ మిషన్‌లో చేపట్టిన పనులు ముందుకు సాగడం లేదు.

రెండు సైకిల్ జోన్లు.. ఎక్కడికక్కడే పనులు

కాజీపేట, హనుమకొండ, వరంగల్ ట్రైసిటీలో యువత సైకిల్ తొక్కడంపై మక్కువ చూపించేలా గతంలో హెరిటేజ్ రైడ్ పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. చారిత్రక దేవాలయాలు, కట్టడాల విశిష్టతలను ప్రపంచ దేశాలకు చాటిచెప్పేలా యాత్ర నిర్వహించారు. ఈ సమయంలోనే స్మార్ట్‌సిటీ కింద రెండు ప్రాంతాల్లో సైకిల్ జోన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

- కాజీపేటలోని నిట్ సంస్థ క్యాంపస్‌లో పైలెట్ ప్రాజెక్టుగా సైకిల్ జోన్‌ను అమలు చేసేందుకు అధ్యాపకులు, విద్యార్థులు వాహనాలను పక్కన పెట్టి సైకిళ్లపైనే వెళ్లాలనుకున్నారు. హైదరాబాద్‌లోని బైస్కిల్ అసోసియేషన్ వారు నామమాత్రపు అద్దెతో సైకిళ్లను అవసరమైన వారికి ఇస్తారని చెప్పినా.. పూర్తిస్థాయిలో సైకిల్ జోన్ అమల్లోకి రాలేదు.
- భద్రకాళి అమ్మవారి దేవాలయం వరకు కార్లు, ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేసి సైకిళ్లపై వెళ్లాల్సి ఉంది. ఇందుకోసం సైకిల్ వాడాలి కాబట్టి కాపువాడ రోడ్ వరకు ఇదే విధానం అమల్లో ఉండేలా ఏర్పాటు చేయాలనుకున్న మరో సైకిల్ జోన్ కల నెరవేరలేదు.



ప్రమాదకరంగా ఉన్న డ్రెయినేజీ

సగం సగంగా 'స్మార్ట్' రహదారులు..

వరంగల్ మహా నగరంలో స్మార్ట్ రోడ్ల నిర్మాణాలకు డిజైన్లు చేశారు. నాలుగు రోడ్లకు రూ.44.50 కోట్ల నిధులు కేటాయించారు. వీటికి పెడస్ట్రియన్ రోడ్లను ప్రతిపాదించారు. హనుమకొండలోని కాపువాడ నుంచి భద్రకాళి అమ్మవారి దేవాలయం, రంగంపేట కూడలి, కేఎంజీ పార్కు, గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ కార్యాలయం వరకు.. ములుగురోడ్డులో దర్గా నుంచి కాపువాడ రోడ్ వరకు మరో రహదారి పనులు అసంపూర్తిగా ఉన్నాయి. హనుమకొండ చౌరస్తా నుంచి విజయ టాకీస్ రోడ్, పద్మాక్షిగుట్ట, భద్రకాళి బండ్ మీదుగా హంటర్ రోడ్ వరకు స్మార్ట్ రోడ్డు వేయగా.. ఈ మార్గంలోనూ ఉండాల్సిన సైకిల్ ట్రాక్ పూర్తి చేయలేదు. రూ.35కోట్లతో హనుమకొండ పద్మాక్షి ఆలయం నుంచి భద్రకాళి చెరువు వరకు రోప్ వే నిర్మాణం జరగాల్సి ఉంది. 'స్మార్ట్'నాలాలు, బిజినెస్ డిస్ట్రిక్ట్, సుందర పర్యాటక ప్రాంతాల అభివృద్ధి సుదూరంగా ఉన్నాయి.

- వరంగల్ స్మార్ట్‌సిటీగా ఎంపిక: 2016 మే 16
- పనులకు డీపీఆర్‌లు సిద్ధం: 2016 జూలై ..
- ప్రాజెక్టుల అంచనా: రూ.2,305.77 కోట్లు
- పనులు పూర్తయిన ప్రాజెక్టులు 27, వాటి విలువ: రూ.74.15 కోట్లు
- పురోగతిలో ఉన్న ప్రాజెక్టులు 39, వాటి అంచనా: రూ.1,362కోట్లు
- టెండర్ ప్రాసెస్‌లో ఉన్న 15 ప్రాజెక్టుల అంచనా: రూ.231కోట్లు
- డీపీఆర్‌లు ఆమోదించిన10 ప్రాజెక్టుల అంచనా: రూ.55.62కోట్లు
- డీపీఆర్‌ల రూపకల్పనలో ఉన్న 18 ప్రాజెక్టుల అంచనా: రూ.583కోట్లు

మహా నగరం చుట్టూ స్వాగత తోరణాలేవి?

హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, భూపాలపల్లి తదితర ప్రాంతాలనుంచి గ్రేటర్ వరంగల్ మహానగరంలోకి ప్రవేశించే వారికి ఆకట్టుకునే విధంగా ఏర్పాటు చేసే కాకతీయ కళాతోరణ స్వాగత తోరణాల పనులు పడకేశాయి. ఎన్‌హెచ్- 563 వరంగల్-కరీంనగర్ రోడ్‌పై ఎల్లాపూర్ సమీపంలో ఓ స్వాగత తోరణం ఏర్పాటు చేయాల్సి ఉంది. ఎన్‌హెచ్-163 వరంగల్-హైదరాబాద్ రోడ్, ఎస్‌హెచ్-8 వరంగల్-ఖమ్మం రోడ్, ఎన్‌హెచ్-163 వరంగల్-ములుగు రోడ్, ఎండీఆర్ - 16 (మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్) ఆరెపల్లి కంఠాత్మకూర్ రోడ్‌లో ఇంకా స్వాగత తోరణాల ఏర్పాటు పూర్తి కాలేదు.

ఆరేళ్లు గడిచినా అసంపూర్తి పనులే..



స్మార్ట్‌సిటీ పనులను మంత్రి కేటీఆర్ 2017 నవంబర్‌లో ప్రారంభించారు. ఇంత వరకు హనుమకొండ పద్మాక్షి గుట్ట నుంచి న్యూశాయంపేట వరకు చేపట్టిన పనులు అసంపూర్తిగా ఉండడం వల్ల చీకట్లో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. టూరిజం స్పాట్‌లో ఇంత దారుణంగా చేస్తే ఎలా.

- తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్, 10వ డివిజన్

బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారు



ఆకర్షణీయ నగరంగా ఎంపికైన వరంగల్‌లో అభివృద్ధి పనులపై పాలకులు, ఇంజనీర్లు బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారు. ప్రారంభించిన పనుల పురోగతిపై సమీక్షలు చేయకుండా కొత్త ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేస్తున్నారు. దీంతో కేంద్రం తలపెట్టిన మిషన్ ర్యాంకింగ్‌లో వరంగల్ వెనుకబడిపోతోంది.

- పుల్లూరి సుధాకర్, అధ్యక్షుడు, ఫోరం ఫర్ బెటర్ వరంగల్


వచ్చే ఏడాది జూన్‌లోగా పూర్తి చేస్తాం



స్మార్ట్‌సిటీ కింద వచ్చిన నిధులతో చేపట్టిన పనులు 60శాతం పూర్తయ్యాయి. మిగిలిన పనులను వచ్చే ఏడాది జూన్‌లోగా పూర్తి చేస్తాం. స్థల వివాదాలు, కాంట్రాక్టర్ల జాప్యం తదితర కారణాలతోపాటు నిధుల కొరత వల్ల ఆలస్యమైన మాట వాస్తవమే. ఎలాగైనా పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తాం.

- వాసుచంద్ర, ఎస్ఈ, గ్రేటర్ వరంగల్

ఇలా ఎప్పుడు సాధ్యం..







ఈ ఫొటోలు చూడండి.. స్మార్ట్ సిటీ ప్రతిపాదనల్లోని బిజినెస్ డిస్ట్రిక్ట్, భద్రకాళి బండ్ పరిసర ప్రాంతాలు, నాలాలు.. వాటి పక్కన నగరవాసులు నడుస్తున్న ఊహాచిత్రాలు ఇవి. స్మార్ట్ సిటీ పనులు పూర్తయితే నగరం ఇలా సుందరంగా ఉంటుందని అనుకోవాల్సిన పరిస్థితి ఉంది. కానీ పనులు చూస్తే ఊహాచిత్రాలు.. ఊహగానే మిగిలిపోతున్నాయని నగరవాసులు భావిస్తున్నారు.

పుస్తకాలకు ఆర్ఎఫ్ఐడీ ట్యాగ్ చేయాలి

- స్మార్ట్ సిటీ పనులు పూర్తి చేయండి
- క్షేత్రస్థాయి పర్యవేక్షణలో కలెక్టర్, కమిషనర్



రంగంపేటలోని సెంట్రల్ లైబ్రరీని పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్, కమిషనర్ బాషా

వరంగల్ అర్బన్: రీజినల్ లైబ్రరీలోని పుస్తకాలన్నింటికీ ఆర్ఎఫ్ఐడీ (రేడియో ఫ్రీక్వెన్సీ డిటెక్టర్) ట్యాగ్‌లు అమర్చాలని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాతో కలిసి నగరంలో స్మార్ట్ సిటీ పథకంలో భాగంగా హనుమకొండ జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న భద్రకాళి బండ్, పోతన ట్రాన్స్‌ఫర్ స్టేషన్, రీజనల్ లైబ్రరీ, అజర హాస్పిటల్ ప్రాంతంలో నిర్మిస్తున్న కల్వర్టు, వడ్డేపల్లి బండ్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రంగంపేటలోని రీజనల్ లైబ్రరీలో ఈ-లైబ్రరీ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చి వివిధ అంశాలకు చెందిన 4 నుంచి 5 వేల పుస్తకాలను చదువుకునేలా అందుబాటులో ఉంచడం అభినందనీయమని ప్రశంసించారు. కొనసాగుతున్న స్మార్ట్ సిటీ అభివృద్ధి పనుల పురోగతిని త్వరలో సమీక్షిస్తామని అందుకోసం క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితుల వివరాలను వెల్లడించాలని పేర్కొన్నారు. భద్రకాళి బండ్‌పై కొనసాగుతున్న పనుల్ని సెప్టెంబర్ మొదటి వారంలోగా పూర్తి చేయాలని సూచించారు. కాకతీయ మ్యూజికల్ గార్డెన్ వైపు ఉన్న గోడను తొలగించి పోతన ట్రాన్స్‌ఫర్ స్టేషన్ వైపు ఉన్న కాంక్రీట్ పనులను ఒక నెలలోపు పూర్తి చేసి ప్రారంభించేలా చర్యలు చేపట్టాలన్నారు. పోతన మందిరానికి సమీపంలోని లాండ్రోమార్ట్ ప్రాంతంలో ల్యాండ్ స్కేప్ పనులను పూర్తి చేయాలని సీఎంహెచ్ఓను కలెక్టర్ ఆదేశించారు. వడ్డేపల్లి బండ్ ప్రాంతంలో పర్యటించిన కలెక్టర్ అక్కడ రిటైనింగ్ వాల్‌ను నిర్మించాలని అధికారులను ఆదేశించారు. ఈతనిఖీల్లో బల్దియా ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, సీహెచ్ఓ శ్రీనివాసరావు, డీసీపీ ప్రకాశ్‌రెడ్డి, ఈఈలు రాజయ్య, సంజయ్‌కుమార్, డీఈలు రవికుమార్, సంతోశ్‌బాబు, స్మార్ట్ సిటీ పీఎంసీ ఆనంద్ ఓలేటి తదితరులు పాల్గొన్నారు.

హనుమకొండ అదనపు కలెక్టర్‌గా మహేందర్‌జీ

- సంధ్యారాణి బదిలీ
- హనుమకొండ, పరకాల ఆర్డీఓలు కూడా



మహేందర్‌జీ

హన్మకొండ అర్బన్: హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా మహేందర్ జీని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంతకాలం అదనపు కలెక్టర్‌గా పని చేసిన సంధ్యారాణికి ప్రభుత్వం ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. మహేందర్ జీకి వివాదరహితుడిగా పేరుంది. తహసీల్దార్ స్థాయిలో జిల్లాలో పని చేసిన అనుభవం ఉంది. ఈయన ఉమ్మడి జిల్లాలోని ములుగులో కొంత కాలం ఆయన ఆర్డీఓగా పని చేశారు. ప్రస్తుతం వరంగల్ ఆర్డీఓగా ఉన్న మహేందర్‌జీకి హనుమకొండ అదనపు కలెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. హనుమకొండ ఆర్డీఓ వాసుచంద్రను బదిలీ చేశారు. ఆయన స్థానంలో తొర్రూరులో విధులు నిర్వర్తిస్తున్న ఎల్.రమేశ్‌కు పోస్టింగ్ ఇచ్చారు. పరకాల ఆర్డీఓ రామును బదిలీ చేసి, ఆయన స్థానంలో కె.శ్రీనివాస్‌కు పోస్టింగ్ ఇచ్చారు. శ్రీనివాస్ ప్రస్తుతం భూపాలపల్లి ఆర్డీఓగా పని చేస్తున్నారు. కాగా.. రాముకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు.

సీజనల్ వ్యాధులను నియంత్రించాలి

హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్

హన్మకొండ అర్బన్: జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులు, డీవార్మింగ్ డే, మిషన్ ఇంద్రధనస్సు, ఫైలేరియా మాత్రల పంపిణీ కార్యక్రమాలపై జిల్లా స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఇందులో కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ.. నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఈనెల 20న ఏడాది వయస్సు నుంచి 19 ఏళ్లలోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు అందించాలని ఆదేశించారు. ఆగస్టు 10 నుంచి జిల్లాలో పలు యూపీహెచ్‌సీ పరిధిలో సామూహిక మాత్రల పంపిణీ కార్యక్రమం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ బి.సాంబశివరావు, డీపీఓ జగదీశ్వర్, డీఈఓ అబ్దుల్ హై, ఎంసీహెచ్ఓ డాక్టర్ రాజేశ్, డిప్యూటీ డీఎంహెచ్ఓ టి.మదన్మోహన్ రావు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి గీతాలక్ష్మి, జిల్లా సర్వేలెన్స్ ఆఫీసర్ డాక్టర్ వాణిశ్రీ, ఎన్‌సీడీ అధికారి ఉమాశ్రీ, డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ మధురిమ, మెప్మా డీసీఎం రజిత రాణి పాల్గొన్నారు.

ఓటరు దరఖాస్తులు పెండింగ్ ఉండొద్దు

ఓటరు జాబితాలో నూతనంగా ఓటరు నమోదుకు వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా చూడాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టర్, ఉన్నతాధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ.. మరణించిన, డూప్లికేట్ ఓటర్లను తొలగించిన దరఖాస్తుల పరిశీలన జిల్లా, నియోజకవర్గాల వారీగా పూర్తయినట్లు తెలిపారు. కొత్త ఓటరు నమోదు కోసం బీఎల్ఓల ద్వారా ఇంటింటికీ సర్వే పూర్తి చేసినట్లు తెలిపారు. ఒకే ఇంటి నంబర్‌పై 6 అంతకన్నా ఎక్కువ ఓట్లు నమోదైన వాటికి బీఎల్ఓల ద్వారా ఇంటింటికీ తిరిగి సర్వే చేసినట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్ఓ వాసుచంద్ర, పరకాల ఆర్డీఓ రాము పాల్గొన్నారు. కాగా, జీహెచ్ఎంసీ నుంచి కలెక్టర్ ప్రావీణ్య, వరంగల్ కలెక్టరేట్‌నుంచి కమిషనర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్లు అశ్వినితానాజీ, శ్రీ వత్స పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

ప్రజా సంక్షేమమే కేసీఆర్ లక్ష్యం

ప్రభుత్వ చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్



మాట్లాడుతున్న వినయ్‌భాస్కర్

కాజీపేట రూరల్: ప్రజా సంక్షేమం, అభివృద్ధే సీఎం కేసీఆర్ లక్ష్యమని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. కాజీపేట 47వ డివిజన్ ఇంపీరియల్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం కాజీపేట 5 డివిజన్ల ప్రజా సమస్యలపై 'ప్రజలతో ముఖాముఖి' కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. ఇంపీరియల్ కాలనీలో ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు రూ.30 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మించినట్లు తెలిపారు. కుడా చైర్మన్ సుందర్‌రాజ్ మాట్లాడుతూ.. అభివృద్ధి కోసం తాము కూడా నిధులు మంజూరు చేసి చీఫ్ విప్ చేస్తున్న అభివృద్ధికి సహకరిస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్‌బాషా మాట్లాడుతూ.. ప్రజలతో ముఖాముఖిలో అన్ని విభాగాల అధికారులు పాల్గొని ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయడం బాగుందన్నారు. కాలనీవాసులు పలు సమస్యలపై ఫిర్యాదులు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సంకు నర్సింగరావు, రాములు, మానస రాంప్రసాద్, ఈఈ రాజయ్య, డీఈ సంతోష్ పాల్గొన్నారు.

అధికారులకు సేవా పతకాలు

కాజీపేట: పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీస్ అధికారులు, సిబ్బందికి ప్రభుత్వం సేవా పతకాలను శుక్రవారం రాత్రి ప్రకటించింది. మహోన్నత సేవా పతకాన్ని పీసీఆర్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న ఎస్.వెంకట్రామ్‌కు, ఉత్తమ సేవా పతకాన్ని గతంలో సీసీఆర్‌బీ ఏసీపీగా పని చేసిన ప్రతాప్‌కుమార్‌కు, మరో 27 మంది సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం సేవా పతకాలను ప్రకటించింది.

నలుగురు ఇన్‌స్పెక్టర్ల బదిలీ..

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న నలుగురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ కమిషనర్ ఏవీ.రంగనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎ.సువర్ణను భరోసా సెంటర్‌లో వీఆర్ అటాచ్డ్ నుంచి ఉమెన్ పీఎస్ సుబేదారికి బదిలీ చేశారు. కె.కుమారస్వామి ఉమెన్ పీఎస్ సుబేదారి నుంచి వీఆర్ వరంగల్‌కు, కొండూరు సుజాత వీఆర్ అటాచ్డ్ నుంచి కాజీపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. ఎన్.వెంకటరత్నం పీసీఆర్ వరంగల్ నుంచి ఏహెచ్‌టీయూ వరంగల్‌కు అటాచ్డ్ చేశారు.

13 మంది ఎస్సైలు..

కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న 13 మంది ఎస్సైలను బదిలీ చేస్తూ.. శుక్రవారం రాత్రి సీపీ ఏవీ.రంగనాథ్ ఆదేశాలు జారీ చేశారు. జే.పరమేశ్వర్ ఎల్కతుర్తి పీఎస్ - వీఆర్ వరంగల్‌కు, గోదారి రాజ్‌కుమార్ హనుమకొండ పీఎస్- ఎస్‌హెచ్ఓ ఎల్కతుర్తికి, నంద్రు సాయిబాబు ధర్మసాగర్ పీఎస్-ఎస్‌హెచ్ఓ ముల్కనూరు, మహేందర్ మసిరెడ్డి ముల్కనూరు- మామునూరు పీస్, బండారి రాజు రాయపర్తి పీఎస్-మడికొండ పీఎస్, మోడెం సాయి ప్రసన్నకుమార్ మట్టెవాడ పీఎస్ - ఇంతేజార్‌గంజ్ పీఎస్, కుమార్ సంతోష్ మిల్స్‌కాలనీ పీఎస్- మట్టెవాడ పీఎస్, బోయిని మంగ వర్ధన్నపేట పీఎస్-భరోసా సెంటర్, డి.సాంబయ్య మిల్స్‌కాలనీ పీఎస్- సుబేదారి పీఎస్, జి.రాజేశ్‌రెడ్డి మామునూరు పీఎస్-ఆత్మకూరు పీఎస్, ఎన్.రమేశ్ దేవరుప్పుల పీఎస్- పరకాల పీఎస్, ఎ.శ్వేత అటాచ్డ్ గీసుకొండ పీఎస్- గీసుకొండ పీఎస్, బి.హరికృష్ణ పరకాల పీఎస్- వీఆర్ వరంగల్‌కు బదిలీ చేశారు.

సాయానికి వేళాయె!

కాజీపేట అర్బన్/కరీమాబాద్ : బీసీలకు లక్ష రూపాయల ఆర్థిక సాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం శనివారంనుంచి ప్రారంభించనుంది. హనుమకొండ జిల్లాలో 13,322 మంది దరఖాస్తు చేసుకోగా.. తొలివిడతగా 11,128 మందిని అర్హులుగా ఎంపిక చేశారు. 2012 మంది అనర్హులు, 182 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వరంగల్ జిల్లాలో 11,296 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఎంతమందిని లబ్ధిదారులుగా గుర్తించారన్న విషయం మాత్రం అధికారులు చెప్పట్లేదు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.

ఒలింపిక్స్ టెక్నికల్ అఫీషియల్‌గా పీఈటీ రాజేందర్



కేసముద్రం: ప్యారిస్‌లో 2024 ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ 2వ రకు జరిగే ప్యారాఒలింపిక్స్ షటిల్ బ్యాడ్మింటన్‌కు టెక్నికల్ అఫీషియల్‌గా మానుకోట జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పీఈటీ కొమ్ము రాజేందర్ ఎంపికై నట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.రమేష్‌కుమార్, కార్యదర్శి డాక్టర్ రమేష్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ డిప్యూటీ టెక్నికల్ ఈవెంట్స్ డైరెక్టర్ క్రిస్టోఫర్ ట్రెన్హోల్మ్ శుక్రవారం రాజేందర్ ఎంపికైనట్లు ఉత్తర్వులు జారీ చేశారని వెల్లడించారు.

పైపైకి పసుపు ధర..

- కేసముద్రం మార్కెట్‌లో క్వింటా రూ.8,231



కేసముద్రం: మార్కెట్‌లో ఇన్నిరోజులుగా తగ్గిన పసుపు ధర.. ఇప్పుడిప్పుడే పెరుగుతూ వస్తుంది. శుక్రవారం కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో క్వింటా పసుపు (కాడిరకం) గరిష్ట ధర రూ.8,231 పలికింది. మొదట్లో క్వింటాకు గరిష్ట ధర రూ.5వేల నుంచి రూ.6వేల వరకు పలికింది. గత వారం రోజులుగా ధర పెరుగుతూ క్వింటాకు గరిష్ట రూ.8వేలకు చేరుకుంది. శుక్రవారం మార్కెట్‌కు 116 బస్తాల పసుపు అమ్మకానికి రాగా, కాడిరకం పసుపు గరిష్ట ధర రూ.8,231, కనిష్ట ధర రూ.4,259 పలుకగా, గోళారకం పసుపు క్వింటాకు గరిష్ట ధర రూ.8,211, కనిష్ట ధర రూ.6,611 పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు. కాగా పసుపు సాగు విస్తీర్ణంతోపాటు, దిగుబడి తగ్గిపోవడంతో ధర పెరుగుతున్నట్లు వ్యాపారవర్గాలు తెలుపుతున్నాయి.

అంత్యక్రియలకు వెళ్తూ అనంతలోకాలకు..

జనగామ: పెద్దనాన్న అంత్యక్రియల కోసం వెళ్తూ.. ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందిన ఘటన జనగామ రైల్వేస్టేషన్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వెస్ట్‌గోదావరి జిల్లా భీమవరానికి చెందిన కోన ప్రసాద్(45) బతుకు దెరువు కోసం హైదరాబాద్‌లో ఉంటున్నాడు. భార్య, పిల్లలు ఎవరూ లేకపోవడంతో సంచార జీవనం సాగిస్తూ కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఈక్రమంలో స్వగ్రామంలో పెద్దనాన్న చనిపోయినట్లు తెలియడంతో ప్రసాద్ సికింద్రాబాద్ స్టేషన్ నుంచి గోల్కొండ ట్రెయిన్‌లో విజయవాడకు బయల్దేరాడు. జనగామ స్టేషన్‌కు రైలు చేరుకుని తిరిగి కదిలే సమయంలో ప్రసాద్ డోర్ నుంచి కిందకు జారి అందరూ చూస్తుండగానే చక్రాల కింద నలిగి రెండు ముక్కలయ్యాడు. రైల్వే పోలీసులు హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. వివరాలు సేకరించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాద విషయాన్ని భీమవరంలోని కుటుంబ సభ్యులకు తెలియజేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

ఆ ఏడు నెలల పాపకు తల్లెవరో తెలియదు.. తండ్రి స్పర్శ ఏంటో అంతకు మించి తెలియదు.. ఆగంతకుల చేతులు మారుతూ వచ్చిన ఆ చిట్టి తల్లి కన్నవారిని చూడకుండానే కన్నుమూసింది. అభం శుభం తెలియని ఆ చిన్నారి బుధవారం రాత్రి 10 గంటల సమయంలో చలాకీగా కనిపించినా.. 36 గంటలు గడవకముందే విగతజీవిగా మారడం కన్నీళ్లు పెట్టిస్తోంది. ఓవైపు ఈ పాప ఎక్కడి నుంచి చేతులు మారిందనే దిశగా పోలీసులు దర్యాప్తు మొదలెడితే...ఇంకోవైపు ఆ కేసు ఇంకా ఆరంభంలోనే ఉండగా పలుచటి విరేచనాల వల్ల చనిపోవడం అనుమానాలకు తావిస్తోంది. శిశువిహార్ సిబ్బంది నిర్లక్ష్యమా, ఇతర ఏమైనా కారణాలు ఉన్నాయా అన్నది పోలీసులు తేల్చాలని ప్రజలు పేర్కొంటున్నారు.

అయ్యో..‘పాప’ం!

తల్లిదండ్రులను చూడకుండానే కన్నుమూసిన ఏడు నెలల పాప

- శిశుగృహకు చేరుకున్న 36గంటల్లోనే మృతిపై అనుమానాలు
- గురువారం అర్ధరాత్రి తర్వాత విరేచనాలు అయ్యాయంటున్న సిబ్బంది
- తొలుత జీఎంహెచ్‌కు తీసుకెళితే కదలిక లేదని ఎంజీఎంకు సిఫార్సు
- అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించిన ఆస్పత్రి వైద్యులు
- పాప అక్రమ దత్తత కేసును వెలుగులోకి తెచ్చిన 'సాక్షి'




ఆస్పత్రిలో చనిపోయిన పాప

సాక్షి, వరంగల్ : వరంగల్‌లో విదేశీ దంపతుల శిశువు దత్తత వ్యవహారంలో అనూహ్య ఘటన చోటుచేసుకుంది. హనుమకొండలోని శిశువిహార్‌కు చేరేంత వరకు చలాకీగా ఉన్న ఏడు నెలల పాప.. చివరికి మృత్యుఒడికి చేరుకుంది. గురువారం ఉదయం పిల్లల డాక్టర్ నవీన్ వద్ద వైద్యపరీక్షలు చేస్తే అంతా సాఫీగానే ఉన్నా.. గురువారం రాత్రితోపాటు శుక్రవారం ఉదయం పాపకు పలుచటి విరేచనాలు కావడంతో మందులు ఇచ్చినా తగ్గలేదు. ఆస్పత్రికి తీసుకెళ్లినా గంటల వ్యవధిలోనే ప్రాణాలు విడిచింది. అయితే ఇది శిశువిహార్ సిబ్బంది నిర్లక్ష్యమా లేదా దీని వెనుక కుట్ర కోణం ఏమైనా దాగి ఉందా అనేది పోలీసులు తేల్చాల్సిన అవసరముంది. ఎందుకంటే రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన విదేశీ దంపతుల అక్రమ దత్తత కేసు ఇంకా విచారణ ఆరంభ దశలో ఉండగానే ఆ పాప చనిపోవడంతో అందరికీ అనుమానాలు కలుగుతున్నాయి. ఏడు నెలల పాటు వారి వద్ద బాగానే ఉన్న పాప.. శిశువిహార్‌కు రాగానే చనిపోవడం వెనుక ఏమైనా బలమైన కారణాలు ఉన్నాయనేది తేల్చాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే ఇందులో ముఖ్య రాజకీయ నేతల ఒత్తిడి ఉండడం కూడా అనుమానాలను రేపుతోంది. ఇప్పటికే జేజే యాక్ట్ 81 సెక్షన్ కింద అక్రమ దత్తత వ్యవహారంలో అమెరికాలో స్థిరపడిన కొంపల్లి వాసి కరీమ్‌విరాణి, అమెరికా సిటిజన్ అయిన అశామావిరాణితో పాటు వరంగల్‌కు చెందిన రషీదాభాను భోజని, అమ్యాన్ అలీ భోజానిపై కేసు నమోదైంది.

ఏం జరిగిందంటే..

ఏడు నెలల పాపను బుధవారం రాత్రి 10.30 గంటల ప్రాంతంలో వరంగల్ జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ వసుధ, జిల్లా బాలల సంరక్షణ విభాగంలో పనిచేసే ఎస్ఐసీ పీఓ సరిత హనుమకొండలోని శిశు విహార్‌లో చేర్పించారు. అయితే గురువారం రాత్రి 10.30 గంటలకు పాపకు పలుచటి విరేచనాలు రావడంతో అక్కడ విధుల్లో ఉన్న ఏఎన్ఎం పౌడర్ కలిపి తాగించడంతో 12 గంటలకు పడుకుంది. మళ్లీ శుక్రవారం ఉదయం 6.30 గంటల ప్రాంతంలో మళ్లీ పలుచటి విరేచనాలు కావడంతో మెడిసిన్ ఇవ్వడంతో పడుకుంది. అప్పటివరకు విధుల్లో ఉన్న ఏఎన్ఎం 8.30 గంటలకు వెళ్లిపోగా.. 9.30 గంటలకు మరో ఏఎన్ఎం విధుల్లో చేరింది. అప్పటికే ఆ పాపను పరిశీలించగా శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా కనిపించడంతో గవర్నమెంట్ మెటర్నిటీ ఆస్పత్రి (జీఎంహెచ్)కు తీసుకెళ్లారు. అక్కడినుంచి 10.30 గంటల వరకు ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందిందని వైద్యులు ధ్రువీకరించారు. ఇది 174 సీఆర్‌పీసీ (అసహజ మరణం) కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఏ తల్లి కన్నబిడ్డనో.. పాపం..





పాప కేసును వెలుగులోకి తెచ్చిన సాక్షి

పాప అక్రమ దత్తత విషయాన్ని సాక్షి వెలుగులోకి తెచ్చింది. పాప అడాప్షన్ విషయంలో ఉన్న లొసుగులు.. పాపను ఎవరు ఇచ్చారు.. మేడ్చల్ జిల్లానుంచి ఇక్కడికి ఉన్న లింకులు ఏమిటీ విషయాలను సాక్షిలో ఎక్స్‌క్లూజివ్‌గా ఇవ్వగా స్పందించిన పోలీస్, శిశు సంక్షేమ అధికారులు విచారణ జరిపి మరిన్ని విషయాలు రాబట్టారు.

చివరికి అనాథగా మారిన ఆ పాపకు బల్దియా సిబ్బంది అంత్యక్రియలు జరిపారు.

అనుమానాలెన్నో.. తేల్చాల్సినవెన్నో?

- కేసు నమోదైన 48 గంటల్లోనే అనారోగ్యంతో పాప మృతి చెందడంపై అనుమానాలు ఉన్నాయి.
- విదేశీ దంపతుల కారాకు దరఖాస్తు చేసుకున్న ఇన్‌కంట్రీ అడాప్షన్ నుంచి విత్ డ్రా ఎందుకయ్యారు అన్నది ప్రశ్నార్థకంగా ఉంది. అదే సమయంలో వీరిపై అక్రమ దత్తత కింద మట్టెవాడ ఠాణాలో కేసు నమోదైంది.
- ఆ పాప అనారోగ్యంతో బాధపడుతుంటే విరాణి దంపతులు ఎందుకు దత్తత తీసుకునేందుకు ఆసక్తి చూపారన్నది తేల్చాల్సి ఉంది.
- ఈ పాప దత్తత విషయంలో ఢిల్లీ నుంచి వరంగల్ వరకు కారా, సారా అధికారుల నుంచి ఎందుకు ఒత్తిడి తెచ్చారన్నది తేల్చాల్సి ఉంది.
- అసలు వీళ్లకు నిజంగా సంతానం ఉన్నారా లేదా ఒకవేళ లేకుంటే ఆపా ద్వారానే రిజిస్ట్రేషన్ చేసుకొని కారా ద్వారా శిశు విహార్‌లో ఉంటున్న ఏ పాపనైనా దత్తత తీసుకుంటే ప్రొసీజర్ ప్రకారం ఉండేది కదా. అసలు ఈ పాపనే ఎందుకు దత్తత తీసుకున్నారు అన్నది అంతుచిక్కని ప్రశ్నగా ఉంది.
- ఇప్పటికే భోజాని దంపతులకు పాప ఇచ్చినట్లు చెబుతున్న మేడ్చల్ జిల్లా కొంపల్లిలోని ఓ ఆస్పత్రిలో పనిచేసే రాణితోపాటు కృష్ణవేణిని పోలీసులు అదుపులోకి తీసుకుంటే ఆ పాప జాడ తెలుస్తుంది.
- అన్నింటికీ మూలమైన ఈ పాప తల్లిదండ్రుల ఆచూకీ దొరుకుతుందా.. లేదా దీని వెనుక ఉన్న అక్రమ రవాణా ముఠా మూలాలను వెలుగులోకి తెస్తారా.. లేదా పాప చనిపోయిందని కేసు పట్టించుకోకుండా ఉంటారా.. అన్న ప్రశ్నలు ప్రజల నుంచి వస్తున్నాయి.

రూ.ఐదు లక్షలకు పాప కొనుగోలు

- డీఎన్ఏ పరీక్షలు కూడా చేయాలి సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ వసుధ

ఎంజీఎం : పాపను అక్రమ దత్తత తీసుకున్న వారిని హైదరాబాద్ నుంచి వరంగల్ పోలీసు కమిషనర్ కార్యాలయానికి పిలిపించినట్లు సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ వసుధ తెలిపారు. పాప మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహిస్తున్న క్రమంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. అక్రమ దత్తత తీసుకున్న తల్లిదండ్రులను సీపీ కార్యాలయంలో ప్రశ్నించగా ఐదు లక్షల రూపాయలకు కొనుగోలు చేసినట్లు ఒప్పుకున్నారని పేర్కొన్నారు. ఈ విషయంపై మట్టెవాడ పోలీసులకు ఫిర్యాదు చేసి, 12వ తేదీ రాత్రి పాపను వారి నుంచి తీసుకుని శిశుగృహలో అప్పగించి, మెడికల్ రిపోర్టు సైతం అందించామని తెలిపారు. మరుసటి రోజు రాత్రి సమయంలో విరేచనాలు కావడంతో చికిత్స చేసి పడుకోబెట్టామని చెప్పారు. తర్వాత రోజు ఉదయం రెండు, మూడుసార్లు విరేచనాలు కావడంతో పక్కనే ఉన్న జీఎంహెచ్‌కు తీసుకెళ్లారని, అక్కడి నుంచి వైద్యుల సూచన మేరకు ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లారని తెలిపారు. ఎంజీఎం ఆస్పత్రికి వెళ్లేసరికి పాప మృతి చెందిందని వైద్యులు చెప్పారని వివరించారు. పాపకు క్రానిక్ ఎలర్జీతోపాటు క్రానిక్ డయేరియా కూడా ఉందని చెప్పారు. చిన్నారికి డీఎన్ఏ పరీక్షలు కూడా చేయాల్సి ఉందని ఆమె పేర్కొన్నారు. ఆయా రాణిని గుర్తిస్తే తప్ప అసలు తల్లిదండ్రులు ఎవరో తెలిసే అవకాశం ఉందని, పోస్టుమార్టం నివేదికలోనే అసలు విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని స్పష్టం చేశారు.

బాధ్యతాయుతంగా పనిచేస్తేనే విజయం

- కేయూ వీసీ రమేశ్



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ రమేశ్

కేయూ క్యాంపస్: బాధ్యతాయుతంగా పనిచేసినప్పుడే విజయం సాధ్యం అవుతుందని కాకతీయ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య తాటికొండ రమేశ్ అన్నారు. శుక్రవారం హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ బన్న ఐలయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేయూ అన్ని రంగాల్లో ముందుకు తీసుకుపోవడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా కృషి చేయాలని చెప్పారు. కేయూలో తక్కువ మంది రెగ్యులర్ అధ్యాపకులు ఉన్నారని అయినప్పటికీ మొక్కవోని ధైర్యంతో ప్రజెంటేషన్ చేయడం వల్లనే కేయూ ఏ ప్లస్ గ్రేడ్ సాధించిందన్నారు. విశ్వవిద్యాలయంలో రిక్రూట్మెంట్ జరిగితే ముందుగా ఇక్కడ పని చేస్తున్న వారికే అవకాశం ఇస్తామని అన్నారు. ఉపాధి కల్పన కోర్సులను ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆర్ట్స్ కళాశాలను నేషనల్ అసెస్మెంట్ అక్రిడేషన్ గుర్తింపు కోసం ప్రిపేర్ చేసేందుకు అందరూ టీం వర్క్ చేయాలని, కళాశాలలో ఆడిటోరియం, సెమినార్ హాల్ నిర్మాణానికి తగిన చర్యలు చేపడతామన్నారు. ఘన చరిత్ర కలిగిన ఆర్ట్స్ కళాశాల సజీవంగా ఉండడానికి తీసుకోవాల్సిన చర్యలు అన్నీ తీసుకుంటానని అన్నారు. ప్రిన్సిపాల్ బన్న ఐలయ్య మాట్లాడుతూ విశ్వవిద్యాలయం న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధించడంలో వీసీ పట్టుదల, కమిట్మెంట్ ఎంతగానో దోహదపడిందని అన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య హనుమంతు, సహాయక రిజిస్టర్ డాక్టర్ నరసింహారావు, డాక్టర్ కర్ణాకర్ రావు, డాక్టర్ చిర్ర రాజు, డాక్టర్ శ్రీధర్ కుమార్ లోథ్, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ ఫిరోజ్, డాక్టర్ శేషు ప్రసంగించారు. అనంతరం ప్రిన్సిపాల్, అధ్యాపకులు కలిసి వీసీ రమేశ్‌ను సత్కరించారు.

‘పురుగుల’ బియ్యం వాపస్



హైస్కూల్‌లో బియ్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు



పురుగులతో కూడిన బియ్యాన్ని వాపస్ తీసుకెళ్తున్న సిబ్బంది

విద్యారణ్యపురి: హనుమకొండలోని డీఈఓ కార్యాలయం పక్కనే ఉన్న సుబేదారి ప్రభుత్వ హైస్కూల్‌లో మధ్యాహ్నభోజనంలో పురుగులు వచ్చిన విషయం విదితమే. పత్రికల్లో వార్తల ద్వారా వెలుగులోనికి రావడంతో స్పందించిన సంబంధిత అధికారులు డీఎస్ఓ విజయలక్ష్మి, డిప్యూటీ ఎంఆర్ఓలు రమేష్, సత్యనారాయణ శుక్రవారం సుబేదారి ప్రభుత్వ హైస్కూల్‌ను సందర్శించారు. పాఠశాలకు పంపిణీ చేసిన బియ్యాన్ని పరిశీలించి, పురుగులు ఉన్నట్లుగా గుర్తించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని ఇన్‌చార్జ్ హెచ్ఎం శ్రీదేవి, మధ్యాహ్నభోజనం ఇంచార్జి సక్రూ, మధ్యాహ్నభోజన కార్మికులతో అధికారులు మాట్లాడారు. అనంతరం ఈనెల 12న పాఠశాలకు పంపిణీ చేసిన బియ్యం వాపస్ తీసుకొని మళ్లీ నాలుగు క్వింటాళ్ల కొత్త బియ్యం శుక్రవారం పంపిణీ చేశారు. ఇదిలా ఉండగా ఆ హైస్కూల్ పరిధిలోనే ఉన్న 'ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు మరో రెండు క్వింటాళ్ల కొత్త బియ్యం పంపించారు.

ఆరు మోటార్లతో ఎత్తిపోతలు

- స్వల్పంగా తగ్గుముఖం పట్టిన ప్రాణహిత ఇన్‌ఫ్లో



లక్ష్మీపంపుహౌస్‌లో నీటిని ఎత్తిపోస్తున్న మోటార్లు

కాళేశ్వరం: జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి లక్ష్మీ పంపుహౌస్‌లో ఆరు మోటార్లతో అధికారులు నీటిని ఎత్తిపోస్తున్నారు. శుక్రవారం లక్ష్మీపంపుహౌస్‌లోని పదకొండు మోటార్లలోని ఆరు మోటార్లతో 12.70వేల క్యూసెక్కుల నీటిని ఎత్తిపోయగా గ్రావిటీకాల్వ ద్వారా అన్నారం(సరస్వతీ) బ్యారేజీకి జలాలు తరలిపోయాయి. కాగా, మహారాష్ట్ర నుంచి తరలివస్తున్న ప్రాణహిత నదికి వరద స్వల్పంగా తగ్గడంతో ఇన్‌ఫ్లో 98,510 కూసెక్కులు వస్తుంది. లక్ష్మీబ్యారేజీలో 85గేట్లు ఉండగా 36 గేట్లు ఎత్తి నీటిని దిగువకు తరలిస్తున్నారు. దీంతో 1.01లక్షల క్యూసెక్కుల వరద తరలిపోతోంది. బ్యారేజీ పూర్తి సామర్థ్యం 16.17 టీఎంసీలకు ప్రస్తుతం 10.100 టీఎంసీలు, సరస్వతీ బ్యారేజీలో 66గేట్లు మూసి ఉంచారు. బ్యారేజీ సామర్థ్యం10.87టీఎంసీలకు 7.72 టీఎంసీలు నిల్వ ఉంది. మానేరు, ఇతర వాగుల నుంచి ఇన్‌ఫ్లో 4వేల వరకు వస్తుంది. గోదావరిలో నీటి లభ్యత లేదు. దీంతో ఎగువన వర్షాలు తగ్గడంతో ప్రాణహిత నదిలో స్వల్పంగా వరద తగ్గింది. బ్యారేజీల్లో నీటినిల్వలు కూడా తగ్గుముఖం పడుతున్నాయి.

వేధింపులు.. మరణానికి కారణమైన వ్యక్తికి జైలు

వరంగల్ లీగల్: పక్క ఇంటిల్లో ఉంటున్న గృహిణి సెల్‌ఫోన్‌కు అసభ్యకరమైన, దురుద్దేశంతో కూడిన వీడియోలు, చాటింగ్‌లు పంపించడంతోపాటు, నిలదీసిన సదరు గృహిణి భర్తను చంపుతానని బెదిరించడంతో కుంగిపోయిన సదరు గృహిణి భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఇందుకు కారణమైన నెక్కొండ మండలం తోపనపల్లికి చెందిన భీమారం ఎస్‌వీఎస్ కళాశాల ఉద్యోగి అంబటి మహేందర్‌రెడ్డికి ఐదు సంవత్సరాల జైలుశిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ సహాయక సెషన్స్ జడ్జి బి.శ్రీనివాసులు శుక్రవారం తీర్పు వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం భూపాలపల్లి మండల కేంద్రానికి చెందిన పతంగి శ్రీకాంత్ అలియాస్ కిరణ్ చింతగట్టు ఎస్సారెస్పీలో ఏఈగా పనిచేసేవాడు. తన భార్య, కుమారుడితో కలిసి భీమారంలో అద్దె ఇంట్లో ఉంటున్నారు. అదే ఇంట్లో మరో పోర్షన్‌లో ఎస్‌వీఎస్ కళాశాల ఉద్యోగి అంబటి మహేందర్‌రెడ్డి అద్దెకు ఉన్నాడు. అరుణపై చెడు దృష్టి కలిగిన మహేందర్‌రెడ్డి ఆమె ఫోన్‌కు అసభ్య వీడియోలు, చాటింగ్ చేసేవాడు. దీంతో శ్రీకాంత్‌కు విషయం తెలిసి మహేందర్‌రెడ్డిని మందలించాడు. కోపోద్రిక్తుడైన మహేందర్‌రెడ్డి నువ్వు చనిపో లేదా నేనే నిన్ను చంపి నీ భార్యను లొంగదీసుకుంటా అని బెదిరించి, శ్రీకాంత్‌పై దాడి చేశాడు. దీంతో మనస్తాపం చెందిన శ్రీకాంత్ ఫిబ్రవరి 3, 2017న ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో శ్రీకాంత్ తండ్రి సమ్మయ్య ఫిర్యాదు మేరకు కేయూసీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈకేసు విచారణ అనంతరం మహేందర్‌రెడ్డి కారకుడని నిరూపణ కావడంతో శిక్ష విధిస్తూ జడ్జి శ్రీనివాసులు తీర్పు వెల్లడించారు. పోలీసు అధికారులు సుబ్బారెడ్డి, సతీష్, రాజ్‌కుమార్ కేసును పరిశోధించగా లైజన్ ఆఫీసర్ డి.వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో కానిస్టేబుల్స్ రాజేందర్, సంజయ్‌కుమార్ సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ భద్రాద్రి కేసు వాదించారు.

పురుగుల మందు డబ్బాతో కలెక్టరేట్‌లో యువకుడి ఆందోళన



కలెక్టరేట్‌లో అనిల్‌కుమార్‌ను అడ్డుకుంటున్న పోలీసులు

మహబూబాబాద్: సర్పంచ్ భర్త తనపై దాడి చేయించారని, అతనితో తనకు ప్రాణహాని ఉందని మహబూబాబాద్ జిల్లా కురవి మండలం అయ్యగారిపెల్లి గ్రామానికి చెందిన అనిల్ కుమార్ శుక్రవారం పురుగుల మందు డబ్బాతో కలెక్టరేట్ ఆవరణలో ఆందోళన చేశారు. పోలీసులు గమనించి పురుగుల మందు డబ్బా లాక్కున్నారు. బాధితుడు అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 3న గ్రామంలో ముత్యాలమ్మ గుడి పనుల విషయంలో జరిగిన సమావేశంలో ప్రొటోకాల్ ప్రకారం ఉపసర్పంచ్‌ను వేదికపైకి పిలవకుండా సర్పంచ్‌తోపాటు వార్డు సభ్యులు కూర్చున్నారన్నారు. ఈ విషయంలో ఉపసర్పంచ్‌ను ఎందుకు పిలవలేదని సర్పంచ్ భర్తను అడగడంతోపాటు విషయాన్ని వాట్సాప్‌గ్రూప్‌లలో పోస్టు చేశానన్నారు. దీనిని మనస్సులో పెట్టుకున్న సర్పంచ్.. పదిహేనుమందితో తనపై దాడి చేయించారని ఆరోపించారు. గతంలోనే సర్పంచ్ భర్తతో ప్రాణహాని ఉందని కురవి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పట్టించుకోలేదని, కలెక్టర్‌కు తన బాధను వాట్సాప్‌లో పంపగా స్పందించి పోలీస్‌లను విచారణ చేయాలని ఆదేశించారన్నారు. తనకు న్యాయం చేయాలని కలెక్టర్ కాళ్లు పట్టుకునేందుకు వచ్చానని తెలిపారు.

ప్రభుత్వ సంగీత కళాశాలలో అడ్మిషన్లు

హన్మకొండ కల్చరల్ : వరంగల్ విద్యారణ్య ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో 2023–24 విద్యాసంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. సుధీర్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్ణాటకగాత్రం, హిందుస్థానీగాత్రం, కూచిపూడి నృత్యం, పేరిణీనృత్యంలతో పాటు కర్ణాటక వయోలిన్, మృదంగం, సితార్ వాద్య సర్టిఫికెట్‌కోర్సు, డిప్లమాకోర్సుల్లో చేరవచ్చని తెలిపారు. మధ్యాహ్నం 2గంటల నుండి సాయంత్రం 7గంటల వరకు తరగతులు ఉంటాయని 4సంవత్సరాల సర్టిఫికెట్ కోర్సు పూర్తయిన తర్వాత, 2 సంవత్సరాల డిప్లమా కోర్సులో చేరాల్సి ఉంటుందని సర్టిఫికెట్ కోర్సులో చేరేందుకు రూ.1,400, డిప్లమా కోర్సులో చేరేందుకు రూ.1,800 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జూలై 31వతేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, రూ.20 ఆలస్య రుసుంతో ఆగస్టు 30వ తేదీ వరకు, రూ.50 ఆలస్య రుసుంతో సెప్టెంబర్ 15వ తేదీ వరకు దరఖాస్తులను అనుమతించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం నేరుగా గానీ 0870 2426228 నంబర్ ద్వారా సంప్రదించాలని సూచించారు.

పగిలిన వాటర్ ట్యాంక్

- వరంగల్ రైల్వే స్టేషన్‌లో ఘటన
- పలువురు ప్రయాణికులకు గాయాలు
- పరిశీలించిన డీఆర్ఎం ఏకే.గుప్తా



రైల్వే స్టేషన్‌లో ఒక వైపు పగిలిన వాటర్ ట్యాంక్

కాశిబుగ్గ/వరంగల్: వరంగల్ రైల్వేస్టేషన్‌లోని బుకింగ్ కౌంటర్ భవనంపై ఉన్న వాటర్ ట్యాంక్ గురువారం అర్ధరాత్రి (శుక్రవారం తెల్లవారుజామున) ఒక్కసారిగి పగిలిపోయింది. దీంతో అందులో భారీగా నిల్వ ఉన్న నీరు పెద్దశబ్దంతో పెద్ద శబ్దంతో 1వ నంబర్ ప్లాట్‌ఫాంపై ఉన్న రేకులపై పడడం, రేకులు జాయింట్లు ఊడడంతోపై నుంచి వచ్చిన నీటి ఉధృతికి ప్రయాణికులు ట్రాక్ వైపు కొట్టుకుపోవడంతో తీవ్ర గాయాలపాలయ్యారు. స్టేషన్‌లో ప్రయాణికుల అవసరాల కోసం రెండు వాటర్ ట్యాంకులు ఉన్నాయి. ఒక్కొక్కటి సుమారు 60కేఎల్ సామర్థ్యంతో ఉండడంతో పెద్ద మొత్తంలో ఇందులో నీటిని నిల్వ చేస్తారు. విజయవాడ వైపు ఉన్న ట్యాంక్ 2017లో ఇదే విధంగా ఒక షీట్ పగుళ్లు ఏర్పడి నీరు లీక్ కావడంతో దాని స్థానంలో కొత్త షీటును అమర్చారు. అప్పుడు ఒకే షీట్ పగుళ్లు బారడం వల్ల పెద్దగా ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదని సమాచారం. కానీ, శుక్రవారం తెల్లవారు జామున జరిగిన ప్రమాదంలో ట్యాంకుకు ఉన్న ఎనిమిది షీట్లలో నాలుగు షీట్లు ఒకేసారి పగుళ్లు బారడంతో పెద్ద మొత్తంలో నీరు ఒక్కసారిగి బయటకు రావడంతోనే ఈప్రమాదం జరిగినట్లు రైల్వే అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ఈప్రమాదం జరిగిన సమయంలో ప్లాట్‌ఫాంపై రైళ్ల కోసం ఎదురు చూస్తున్న వరంగల్ కీర్తినగర్‌కు చెందిన నెమిలికొండ కిషన్‌రావు, శకుంతల, జాన్‌పాకకు చెందిన పి.రామబ్రహ్మం(64), భార్య రమాదేవి(54), హరీష్‌కుమార్(34), పశ్చిమ బెంగాల్‌కు చెందిన లయురద్‌షా(23), జహంగీర్‌షా, సాయిరథ్‌షా(25)లతో పాటు సుమారు 20మంది గాయపడినట్లు రైల్వే అధికారులు తెలిపారు. వారిని వెంటనే 108 వాహనాల్లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. వారిలో నెమిలికొండ కిషన్‌రావుకు కుడి కాలు విరగగా.. రామబ్రహ్మం తలకు, నడుముకు తీవ్రగాయాలు కావడం, రమాదేవికి అంతర్గతంగా గాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం ఎంజీఎం నుంచి హనుమకొండలోని రోహిణి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. అయితే ట్యాంక్ పగిలిన సమయంలో కేవలం మచిలీపట్నం వెళ్లే రైలు ఎక్కేందుకు ఉన్న ప్రయాణికులు మాత్రమే 1వ నంబర్ ప్లాట్‌ఫాంపై ఉండడంతో పెను ప్రమాదం తప్పింది.

బలహీన పడిన షీట్లు?

రైల్వే స్టేషన్‌లో విజయవాడ వైపు ఉన్న వాటర్ ట్యాంకు చుట్టు ఉన్న జీఆర్‌పీ షీట్లు బలహీన పడి(ఉబ్బి) కనిస్తున్నప్పటికీ అధికారులు దృష్టి సారించకపోవడంతో ఈప్రమాదం చోటు చేసుకుందని ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు. ఇటీవల ఈ రైల్వేస్టేషన్‌ను సుమారు రూ.20కోట్లకు పైగా వెచ్చించి ఆధునికీకరించినా.. ఈట్యాంకులను పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పి.రాంబ్రహ్మం

పరిశీలించిన డీఆర్ఎం

ఏడీఆర్ఎం ప్రదీప్‌కుమార్ రాథోడ్ సీనియర్ రైల్వే అధికారులతో కలసి సంఘటనా స్థలంలో క్షతగాత్రులను పరామర్శించారు. సికింద్రాబాద్ రైల్వే డివిజన్ మేనేజర్(డీఆర్ఎం) అభయ్‌కుమార్ గుప్తా హుటాహుటిన మధ్యాహ్నం వరంగల్ రైల్వే స్టేషన్‌కు చేరుకొని సంఘటన స్థలాన్ని పరిశీలించి ప్రమాదం జరిగిన తీరుపై ఆరాతీశారు. ఇదిలా ఉండగా.. ట్యాంక్ పగిలి గాయాలపాలైన వారికి రైల్వే అధికారులు ఆర్థిక సాయం అందించినట్లు తెలిసింది. ఇందులో తీవ్రగాయాల పాలైన వారికి రూ.లక్ష, స్వల్పంగా గాయపడిన వారికి రూ.25వేల చొప్పున అందజేసినట్లు సమాచారం.